క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఏపీఓ శ్రీకాంత్‌గౌడు పరిశీలించారు. వర్షం పడడంతో పనులు చేయడానికి ఎంతో అనుకూలంగా ఉందని కూలీలు వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో కల్పిస్తున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆలస్యం చేయకుండా చేసిన పనులను బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

సకాలంలో హాజరు కావాలి

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పావగడ నుంచి ఇతర తాలూకాలకు వెళ్లాల్సిన పోలింగ్ అధికారులకు ప్రత్యేకంగా బస్సులు, వాహనాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎన్నికల అధికారి అతిక్ పాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9న ఉదయం 6 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల మైదానానికి ఎన్నికల సిబ్బంది తప్పక చేరుకోవాలని సూచించారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి


సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో దళిత సంఘం నాయకుల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దామోదరం సంజీవయ్య వృద్ధుల పెన్షన్‌ను ప్రవేశ పెట్టారన్నారు. న్యాయవాది రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు ఏ. వెంకటేసులు, రామంజినేయులు, సూర్యనారాయణ, రవి, కోళ్లప్ప, నరసింహులు, మునిమడుగు నరసింహులు, కదిరప్ప, బీజేపి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూసర్వే

పెనుకొండ: పట్టణంలోని ఈద్గా మైదానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. వైఎస్సార్ జగనన్న స్వచ్ఛ భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. పట్టణంలోని అన్ని భూములు, భవనాలను సర్వే చేయడం జరుగుతుందని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


రాజేష్ (ఫైల్)

రొద్దం: మండల కేంద్రంలోని కొత్త ఎస్సీ కాలనీకి చెందిన రాజేష్ (26) అనే యువకుడు సోమవారం తన ఇంట్లోని పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కాలనీ వాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఏడాది క్రితం రాజేష్ తన భార్యతో విడాకులు తీసుకున్నాడని, అలాగే ఆరోగ్యం బాగాలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్ఐ పేర్కొన్నారు.

పోలింగ్‌కు భారీ భద్రత


పావగడకు చేరుకున్న పోలీసు బలగాలు

పావగడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బెంగళూరు, తమిళనాడు పోలీసు దళాలు సోమవారం పావగడకు చేరుకున్నాయి. ఈ నెల 10న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐలు కాంతారెడ్డి, అజయ్ సారథి నేతృత్వంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ అధికారుల వెంట పోలింగ్ కేంద్రాలకు పోలీసు తరలివెళ్తారని స్థానిక రూరల్ సీఐ కాంతరెడ్డి తెలిపారు. మొత్తం 246 పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతకు ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, హోంగార్డులతో పాటు 350 మంది పోలీసు సిబ్బంది, 85 మంది బీఎస్ఎఫ్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అలాగే 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అక్కడ ప్రత్యేకంగా సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాలు

- 'పది'లో సత్తాచాటిన విద్యార్థులు
- ప్రైవేటుకు దీటుగా మార్కులు
- రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక మార్పులతో మెరుగైన ఉత్తీర్ణత

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రైవేటుకు దీటుగా రాణిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. దీంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల వైపు దృష్టిని సారిస్తున్నారు.


పీ కీర్తన, (543/600)


అనిరుద్‌సాయి, (581/600)


అమూల్య, (539/600)


అశ్వని (581/600)


రాకేష్ (583/600)


గంగ్రోతి, (586/600)


త్రిశ (581/600)


లావణ్య (579/600)


అంకిత (570/600)


పృథ్వీరాజ్ (563/600)

హిందూపురం: మండలంలో 40 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 694 మంది ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో మేఘన అనే విద్యార్థిని 573 మార్కులు సాధించింది. అలాగే మండలంలోని సంతేబిదనూర్ జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి అశ్వనికి 581 మార్కులు సాధించింది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకులంలో 89.74 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ప్రమీల అనే విద్యార్థికి 562 మార్కులు వచ్చాయి. అలాగే పీకేఎస్ఆర్ మున్సిపల్ ఓరియంటల్ పాఠశాలలో 65.11 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో సూర్య అనే విద్యార్థికి 540 మార్కులు వచ్చాయి. మండలంలోని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాలలో 64.12 శాతం ఉత్తీర్ణత వచ్చింది. రాగిని 548 మార్కులు సాధించింది.

- లేపాక్షి మండంలో 11 ప్రభుత్వ పాఠశాలల్లో 399 మంది ఉత్తీర్ణత సాధించారు. లేపాక్షిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలోని ఎల్‌కె. రాకేష్ 583 మార్కులు సాధించాడు. లేపాక్షి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నాగేపల్లికి చెందిన తనూజకు 583 మార్కులు వచ్చాయి.
- చిలమత్తూరు మండలంలోని 8 పాఠశాలల్లో 524 మంది ఉత్తీర్ణత సాధించారు. టేకులోడు గురుకుల పాఠశాలలో జి.గంగ్రోతి అనే విద్యార్థినికి 586 మార్కులు వచ్చాయి. అలాగే టీఎన్.త్రీష 581 మార్కులు సాధించింది.

పెనుకొండ: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పెనుకొండ మండలంలో రాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గొల్ల అంకితకు 570 మార్కులు వచ్చాయి. సోమందేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అమూల్య 547 మార్కులు సాధించింది. రొద్దం మండలంలో మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో చదువుతున్న పృథ్వీరాజ్ 563 మార్కులు సాధించాడు.

గోరంట్లలో...

గోరంట్ల: మండలంలో 10వ తరగతి పరీక్షలను 672 మంది రాయగా 344 మంది పాసయ్యారు. స్థానిక బాలికల పాఠశాల విద్యార్థిని లావణ్య 579, అషామస్త 570 , సాదియా 564 , మోళిక 561 మార్కులు సాధించారు. పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సహానాశ్రీరెడ్డి 569 ,నిషామబాను 548 మార్కులు, మోనిక 531 మార్కులు సాధించారు. గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన హరికృష్ణ 572 మార్కులు, పునీత్‌కార్తీకేయ 557 మార్కులు, పునీత్ 537 మార్కులు సాధించారు. గోరంట్ల ఉర్దు ఉన్నత పాఠశాలకు చెందిన షాఫియ 529 మార్కులు సాధించారు.

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్లుగా నిలిచారని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలో ఉర్దూ పాఠశాలలో 87.50 శాతం ఉత్తీర్ణత సాధించారు. గుండుమల పాఠశాలలో 67 శాతం, వైబీ హళ్లి పాఠశాలలో 66.67 శాతం, హరేసముద్రం పాఠశాలలో 58 శాతం, సిద్ధగిరి పాఠశాలలో 57 శాతం, ఆమిదాలగొంది పాఠశాలలో 56 శాతం విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా అమరాపురం మండలంలో ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 67 శాతం, ఏపీ మోడల్ పాఠశాలలో 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. అగళి మండలం అగళి ఉన్నత పాఠశాలలో 71 శాతం, ఏపీ మోడల్ పాఠశాలలో 77 శాతం, ఇనగలూరు పాఠశాలలో 85 శాతం, పీ బ్యాడిగెర పాఠశాలలో 84 శాతం, కేజీబీవీలో 89 శాతం, ఇరిగేపల్లి పాఠశాలలో 59 శాతం, మధూడి పాఠశాలలో 69 శాతం, ఆర్‌జీపల్లి పాఠశాలలో 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. రొళ్ల మండలం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 87.18 శాతం, కేజీబీవీలో 73.68 శాతం, ఎం రాయాపురం పాఠశాలలో 53.49 శాతం విద్యార్థులు పదో తరగతి పాసయ్యారు. గుడిబండ మండలంలోని ఎస్ రాయాపురం పాఠశాలలో 66.66 శాతం, కెకె పాళ్యం పాఠశాలలో 64 శాతం ,జంబులబండ పాఠశాలలో 51 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

- మడకశిర మండలం గుండుమల ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని పీ కీర్తన 10వ తరగతిలో 543 మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య టెన్త్‌లో 590 మార్కులు సాధించడంపై ఉపాధ్యాయులతో పాటు స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు. అమరాపురం మండలం హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనిరుద్‌సాయి 581 మార్కులు సాధించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి అర్థమయ్యేలా బోధించడంతోనే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించానని అనిరుద్‌సాయి తెలిపారు. గుడిబండ మండలంలోని మోరుబాగుల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అమూల్య 539 మార్కులు సాధించింది. ప్రభుత్వంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ఎంతో ప్రోత్సహించడంతోనే మంచి మార్కులు వచ్చాయని అమూల్య తల్లిదండ్రులు పేర్కొన్నారు.



ప్రమీల (562/600)


అమూల్య (547/600)

పదిలో జిల్లా టాపర్‌గా ప్రియదర్శిని



పావగడ: తాలూకాలోని కోటగుడ్డ గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రియదర్శిని జీఎస్ పదో తరగతిలో 625 మార్కులకుగాను 621 మార్కులు సాధించి తుమకూరు జిల్లా టాపర్‌గా నిలిచింది. రాష్ట్రస్థాయిలో 5వ స్థానం దక్కించుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. బీఈఓ అశ్వర్థ నారాయణతో పాటు తాలూకాలోని గుజ్జనడుకు చెందిన విద్యార్థిని తల్లితండ్రులు సుధీంద్ర, ఉపాధ్యాయురాలు మంజుల తదితరులు ప్రియదర్శినిని అభినందించారు.



14న హనుమాన్ శోభాయాత్ర

హిందూపురం టౌన్: హిందూ సురక్షా సేవా సమితి ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ఆదివారం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీను నిర్వహిస్తున్నట్లు హిందూ సురక్షా సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు స్థానిక సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మేళాపురం దండు రోడ్డులోని బైలాంజనేయస్వామి ఆలయం వరకూ శోభాయాత్ర సాగుతుందన్నారు. భక్తులు, హిందూవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

న్యాయం చేయండయ్యా...

పెనుకొండ: వర్షపు నీరు చెరువులోకి వెళ్లకుండా ఓ పరిశ్రమ నిర్మించడంతో పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోతోందని మండలంలోని చిన్నపరెడ్డిపల్లికి చెందిన రైతులు తిప్పన్న, నరేష్, భారతమ్మ సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు విన్నవించుకున్నారు. మునిమడుగు చెరువులోకి వెళుతున్న వర్షపు నీరు పరిశ్రమ నిర్మాణంతో తమ పొలాల్లో నిలచిపోతోందని పేర్కొన్నారు. దీనివల్ల వేసిన పంటలు నీటిలో మునిగి తమకు నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

బిందు సేద్యంపై అవగాహన

రొళ్ల: మండల పరిధిలోని టీడీపల్లి గ్రామంలోని రైతు పంట పొలాల్లో సోమవారం ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో బిందు, తుంపర సేద్యం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని పెన్నయ్య బావి క్రాస్ సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో పాపసానిపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, గుర్రపుకొండ గ్రామానికి చెందిన రామచంద్రప్ప, మంజులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు మడకశిర ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు రామచంద్రప్ప, మంజులను మెరుగైనా చికిత్సల కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

హిందూపురం టౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సోమవారం బ్రెడ్లను పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జీఎం శేఖర్, కార్యదర్శి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి పాల్గొని రోగులతో మాట్లాడి బ్రెడ్లను అందజేశారు.

ఆగని డ్రిప్ పరికరాల చోరీలు


డ్రిప్ పైపులను చోరీ చేసిన స్థలాన్ని చూపుతున్న బాధిత రైతు

పావగడ: తాలూకా డ్రిప్ పరికరాల చోరీలు కొనసాగుతున్నాయి. నాగలమడక హోబళి రెడ్డివారిపల్లి గ్రామంలో నరసింహారెడ్డి అనే రైతుకు చెందిన 8 ఎకరాల పొలంలో బిందు సేద్యంతో పంటలు పండించుకున్నారు. ఆదివారం దుండగులు డ్రిప్‌తో పాటు ఇతర పైపులను దొంగిలించారు. దీంతో సుమారు రూ.3 లక్షల నష్టం వచ్చిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై తిరుమణి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇటీవల అన్నదానపురం గ్రామానికి చెందిన రైతు శ్రీరామప్ప తోటలో రూ.లక్ష విలువ చేసే 2 ఎకరాల డ్రిప్ పైపులు చోరీకి గురయ్యాయి. అలాగే నాగేనహళ్లి గ్రామం రైతు వెంకటేశప్పకు చెందిన 2 ఎకరాల్లో రూ.లక్ష విలువ చేసే డ్రిప్ పరికరాలు దొంగతనానికి గురవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వీటిపైన కూడా రైతులు తిరుమణి పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రవీంద్రకు ఫిర్యాదు చేశారు. చోరీలను అరికట్టి రైతులను ఆదుకోవాలని ఎస్ఐకు విజ్ఞప్తి చేశారు.

కరుణించు యల్లమ్మా...


రేణుకా యల్లమ్మదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి పక్కన మారెమ్మ గుడి వద్ద వెలసిన రేణుక యల్లమ్మదేవి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయం నుంచి గ్రామ పుర వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఊరేగింపులో వీరభద్రుల నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. వీరభద్రులు చెంబులో బియ్యం వేసి ఖడ్గంతో తిప్పడం, భక్తులు విసుతున్న నిమ్మకాలు, కొబ్బరి కాయలను ఖడ్గంతో కొట్టడం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేష్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల: పదో తరగతి పరీక్షల్లో 500 మార్కుల పైన సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉచిత ఉన్నత విద్య కోసం నిర్వహించే ఆర్డీటీ నిర్వహించే సెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల ఏటీఎల్ నరసింగరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్ల ఏరియా పరిధిలోని గోరంట్ల , అమడగూరు మండలాలకు చెందిన విద్యార్థులు ఈనెల 11 తేదీలోపల గోరంట్ల ఆర్డీటీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసే విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్, విద్యార్థి, వారి తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు జిరాక్స్‌తో పాటు రేషన్‌కార్డు, కులధ్రువీకరణ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జత పరచాలన్నారు. మరిన్ని వివరాలకోసం ఆర్‌డీటీ టీటీఎల్ నరసింగరావు సెల్ నంబర్ 7013382001ను సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

అమరాపురం: మండలంలో గ్రామస్థాయిలో జరిగిన గతంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక బృందం సభ్యులు తనిఖీలు నిర్వహిస్తారని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. సోమవారం తనిఖీ సభ్యులు అమరాపురం పంచాయతీలో జరిగిన పనులపై తనిఖీ చేశారు. వారం రోజుల పాటు గ్రామస్థాయిలో తనిఖీ నిర్వహించి ప్రజా వేదికలో వివరాలను వెల్లడిస్తామన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోవాలి

అమరాపురం: స్థానిక హేమ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం తిప్పన్న మాట్లాడుతూ గ్రామస్థాయిలో సంఘాలను మరింతగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. రుణాలను సక్రమంగా చెల్లించి రెట్టింపు స్థాయిలో రుణాలు పొందాలన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మడకశిర: నియోజకవర్గంలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లపై ముందస్తు ప్రచారం చేస్తున్నాయని, వెంటనే అధికారులు స్పందించి అలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్పందనలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ స్థానిక తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతి పత్రాన్ని సమర్పించారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పట్టాలకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: పట్టణంలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, వెంకటరాముడు కోరారు. ఇందులో భాగంగానే సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం అందించారు. ఇళ్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను నాయకులు వివరించారు. స్పందించిన సబ్‌కలెక్టర్ పట్టాలకు దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి 90 రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బాల్య వివాహాలపై అవగాహన

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే మొదట ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాల చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సూపర్ వైజర్ సన్నక్క, ఏఎస్ఐ రామాంజినేయులు, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం


పరిగి: ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో ప్రముఖ నవలలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి


మడకశిర: వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన గ్రంథాలయ అధికారులు


చిలమత్తూరు: వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారిణి తేజశ్విని

పెనుకొండ: ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరంలో పాల్గొన్న పలువురు వక్తలు విద్యార్థులకు విలువైన సలహాలిచ్చారు. ఉపాధ్యాయులు మురళీ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విశ్రాంత ఉపాధ్యాయుడు జయశంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నంజయ్యగౌడు, ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి వెంకటరమణ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ఎంఈఓ భాస్కర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. జూన్ 11 వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తారని, శిబిరాన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిగి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో గంథాలయంలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సేవామందిరం గ్రంథాలయంలో సైతం ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని లైబ్రేరియన్ లక్ష్మీప్రసన్న ప్రారంభించారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారిణి తేజశ్విని సరస్వతిదేవి చిత్రాపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రొద్దం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించినట్లు గ్రంథాలయ శాఖ మండల అధికారి నాగరాజు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరుకూ శిబిరం ఉంటుందన్నారు.

గోరంట్ల: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ కమిటి ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్ను, నోటు పుస్తకాలు, ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ బైసాని శ్రీనివాసులు, కమిటి సభ్యులు మహమ్మద్ ఆలీ, శ్రీరాములు, సోముశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఎంఈఓ గంగప్ప అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీధర్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయులు శ్రీశైలం, గ్రంథాలయ సిబ్బంది గుణప్రియ విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం ఉదయం లైబ్రేరియన్ జయసింహరాజు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ తెలిపారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం గ్రంథాలయ అధికారి మహబూబ్‌బాషా ప్రారంభించారు. పుస్తక పఠనం, చిత్రలేఖనంపై కల్పించే అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.